రాత్రి 12 గంటలకు పావుగంట తక్కువగా వుంది.

పరీక్షల సమయం కావడంతో అప్పటివరకు చదివి, నిద్ర ముంచుకొస్తుంటే పుస్తకాన్ని గోడపై పెట్టి లైటు ఆర్పేసి పడుకున్నాను.

అది వేసవికాలం కావడం వల్ల గాలికి అంతా ఆరుబయటనే పడుకున్నాము.

నాకు కాస్త కునుకు పట్టిందో లేదో ఎవరో గోడ దుమికినట్లుగా 'ధభిల్లు'మన్న శబ్దం వినిపించింది.

నిద్రలో వున్నవాళ్లే ఆ శబ్దం విని ఉలిక్కిపడి లేచా. కరెంటు పోయినట్లుగా వుంది. అంతా చీకటిగా వుంది.

ఏమీ కనిపించడం లేదు. ఊర్లో దొంగల భయం చాలా వుంది. లేచి చూద్దామంటే నా కొక్కడికి ధైర్యం చాల్లే.

మంచంపై కూర్చునే 'దొంగ' 'దొంగ' అని అరిచా ఇంట్లోవాళ్ళే కాక పొరిగింటి వాళ్ళు కూడా లేచారు.

నాకు కాస్త ధైర్యం వచ్చింది. జరిగిన సంఘటనను వారికి వివరంగా చెప్పాను.

అందరం తలొక్కర్ర చేతపట్టుకొని చిన్న చిన్న సందులలో కూడా వెతకడం ప్రారంభించాం.

ఓ సందులో ఒకతను పరుగెడుతున్నాడు. అంతకె కొద్ది దూరంలో మరొకతను వున్నాడు. వాళ్ళను చూసి "దొంగ, దొంగ పట్టుకోండి, పట్టుకోండి" అని అరుస్తూ వెంబడించి పట్టుకొని చితకబాదాము.

వీళ్ళని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్దామనుకొని ఇంటి

## దొంగ

దాకా తీసుకొచ్చాము.

ఇంతలో కరెంటు వచ్చినట్లుంది, లైట్లు వెలిగాయి.

ఆ లైట్ల కాంతిలో వారి ముఖాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆ ముఖాలను చూసి అందరం నోళ్ళు వెళ్ళబెట్టాము.

వాళ్ళు ఎవరో కాదు. మా ప్రక్కవీధిలో వుంటున్న అశోక్ మరియు రమేష్.

వాళ్లను బట్టి తెలిసిందేమంటే "వాళ్ళు రెండవ ఆట సినిమాకెళ్ళి వస్తూండగా ఒకతను "ఖూరి వల్స్"కు వెళ్ళడం వలన కాస్త వెనక్కి అయ్యాడు. మరొకతన్నిఅందుకోవాలన్న తొందరలో పరుగెత్తాడు" ఇక ఆ తర్వాత మా వాళ్ళంతా దొంగనుకొని పట్టుకొని బాగా కొట్టారు.

వాళ్ళకు క్షమాపణ చెప్పి **First Aid** చేయించి వాళ్ళ ఇంట్లో దించి వచ్చాం.

అసలు దొంగ దొరకనేలేదు. ఎవ్వరిళ్ళకు వాళ్ల వెళ్ళిపోయారు. అంతా మళ్ళీ నిద్రపోయారు.

నేనూ పడుకుందామనుకొని ఓసారి చుట్టూ చూశా. గోడపై పెట్టివున్న నా పుస్తకం క్రిందపడి వుంది.

అక్కడే కొద్ది దూరంలో పిల్లి కనిపించింది. ఆ పిల్లి గోడమీద నుండి పోతూ నా పుస్తకాన్ని క్రింద పడేయడం వల్ల వచ్చిన శబ్దాన్ని విని నేను దొంగనుకొని ఇంత గలభాకు కారణమయ్యాను.

- కందాళ రంగాచారి

# కాలమ్ దాటని కథలు

మైథిలి కాలేజీలోకి కొత్తగా అడుగుపెడుతున్న రెండు జెళ్ళ సీత. పడుచు గుండెల్లో మధురమైన తలపులను సృష్టించే ఆమె అందం పున్నమినాటి 'చంద్రమామ'ని వెక్కిరిస్తుంది. కువకువలాడుతున్న గువ్వల జంట చెట్టు కొమ్మ మీద సరసాలాడుతుంటే... గుబగుబలాడుతున్న గుండెతో మైథిలి తలవంచుకుని నడుచుకుంటూ వస్తుంది. ఎత్తైన ఆమె సిరిజుట్టు నల్లగా నిగనిగలాడుతూ, పొడవుగా వ్రేలాడుతూ త్రాచులా కన్పిస్తోంది. కాలేజీ మెయిన్‌గేటు సమీపించే కొద్దీ ఆమె తల క్రిందికి పోతూ, నడక వేగం హెచ్చుతుంది. గేటుకి దగ్గర్లోనే ఓ పదిమంది జల్సారాయుళ్ళు బైఠాయించి క్రొత్తవాళ్ళను బెదిరిస్తున్నారు. ఓ జులపాల వీరుడు "ఏమిట్రా, కూన బెదురుతోంది... గార్డ్ కావాలేమో అడుగు" అన్నాడు. చప్పట్లు... ఈలలు... మోత... ఇంకొకడు సిన్మా ట్యూన్ లాగించేస్తూ "రెండు జెళ్ళ సీతాసీతా




గుండె నిండా నువ్వే లతా" అంటూ వెనకబడ్డాడు. చివ్వున కోపం పొగలా ఎగిసిపడింది మైథిలికి. కళ్ళు ఎర్రబడుతుంటే... "మిస్టర్ నిన్ను ప్రేమించే అమ్మాయిలు ఎవరూ లేరా?" అడిగింది. "ఇదేమిట్రా బాబూ, వెరైటీ క్వశ్చను వచ్చింది అమ్మాయినోట్లోంచి, 'అక్కలూ చెల్లెళ్ళూ లేరా' క్వశ్చన్ పాతబడిపోయిందా ఏమిటి?" అని స్వగతం గట్టిగా అన్నాడో జర్దాకిళ్ళీ జల్సారాయుడు. కాస్త తడుముకుని... "ఎందుకు లేరూ, చాలామంది ఉన్నారు" అన్నాడు వాడు. అందరి కంటె బాబాయ్‌లా ఉన్నాడు ఇంకొకడు. పళ్ళికిలిస్తూ, "పాపకి లవర్ కావాలేమో అడగరా చిట్టీ! నేను రెడీ" అన్నాడు. షాట్‌గన్‌లా వాడి దగ్గరకి నడచి వచ్చి "నో అబ్జెక్షన్" అంది మైథిలి. దెబ్, ఒక్కడు కిక్కురుమంటే ఒట్టు... బాబాయ్ వీళ్ళు నములుకుంటూ నిల్చుండిపోయాడు. ఇంకోసారి "నో అబ్జెక్షన్ ఎటాల్" గట్టిగా రెట్టిస్తూ ముందుకు నడిచింది మైథిలి. వెనకాలే మౌనం రాజ్యమేలడం ప్రారంభించింది అక్కడ.

—'హిప్పో రవి'

పది గంటలకు వస్తానన్న మినిస్టరు మధ్యాహ్నం మూడు కొట్టినా రాలేదు. మండే ఎండలో షామియానా నీడ చల్లదనాన్ని ఇవ్వలేకపోతోంది. గాలి స్తంభించి ఉమ్మదంగా ఉంది. పైన ఎండ, క్రింద దుమ్ము, మధ్యలో గుప్పు గుప్పుమంటూ జనం వదిలే లంక పొగాకు చుట్టల ధూమం.

ఎదురు చూచి-చూచి జనంలో నిరాశ, నిస్పృహ చోటుచేసుకున్నాయి. ఆకలి దహించివేస్తోంది.

ప్రెసిడెంటు కాశీనాథం జేగురు ముఖంతో హడావిడిగా తిరుగుతూ, జనం అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్తున్నాడు.

క్షణాలు గడిచేకొలది ఆదుర్దా పెరగసాగింది.

ఉన్నట్లుండి జనంలో సంచలనం బయలుదేరింది.

"మినిస్టరొచ్చాడు... మినిస్టరుగారు వచ్చారు!" అని జనంలో కలకలం బయలుదేరింది.

ఇంతలోనే దుమ్మురేపుకుంటూ రెండు కార్లు, రెండు జీపులు వచ్చి షామియానా ముందు ఆగాయి.

మినిస్టరును చూచిన జనం ఒక్క క్షణకాలం చల్లబడ్డారు. వేదిక నెక్కిన పెద్దల మెడలను పూలమాలలు అలంకరించాయి.

మొదటగా మంత్రి మైకు ముందుకు వచ్చి తాను ప్రజాప్రతినిధిని, ప్రజాసేవయే తన సర్వస్వమనీ, దారి పొడుగునా ప్రజల సుఖదుఃఖాలు విచారిస్తూ వచ్చినందువలన సభకు రావడం ఆలస్యమయిందని వివరించి చెప్పి, ఆలస్యంగా వచ్చినందుకు క్షమించవలసిందిగా చెప్పి కూర్చున్నాడు.

## అనుభవాలు

కరతాళధ్వనులతో షామియానా దదదదలాడింది.

నేటి యాంత్రిక యుగంలో వాహనాలు, కర్మాగారాలు విడుదలచేసే కాలుష్యం వలన జరిగే ప్రమాదాలు; అడవులు నరికినందువలన సంభవించే నష్టాలపైన అరడజను మంది తలా అరగంటకు తగ్గకుండా మాట్లాడారు.

జనంలో ఆకలి వచ్చి, నీరసం ఆవహించింది. వేదిక మీది జనం సమితి ఆఫీసులోకి వెళ్ళి కాస్త చల్లబడ్డారు.

సూర్యుడు అస్తాద్రికి చేరుకుంటున్నాడు. త్వరగా తెమిలితే వేరే వెళ్ళి ఫోటోలు తీయవలసిన పని ఉందని ఫోటోగ్రాఫర్లు కసురుకుంటున్నారు. త్వరగా ఇళ్లు చేరాలి లేకపోతే బస్సులందవని చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన జనం ఆరాటపడిపోతున్నారు.

మొత్తంమీద వివరగా అసలు కార్యక్రమం మొదలయింది. తలా ఒక మొక్క అందుకొని భూమాత కర్పించారు. కెమేరా క్లిక్‌లు, ఫ్లాష్‌ల మధ్య మొక్కను మెల్లగా పాదులో పెట్టి నీళ్ళుపోసి మట్టి కూర్చాడు మినిస్టరు.

"అదేమిటి, గోడకు మరీ జానెడు దూరంలో మొక్క నాటారు. అది పెరిగి మానయితే ఒక్క దెబ్బకు గోడపగిలి, బిల్డింగు కూలిపోదూ!" అని అనుమానం వ్యక్తం చేశాడు అనుభవశాలి అయిన ఒక రైతు.

"బిల్డింగు గోడకేం ఫర్వాలేదు. పదేళ్ళబట్టి ఏ అయ్య వచ్చినా మొక్క నాటేది ఈ పాదిలోనేగా!" అంటూ సమాధానమిచ్చాడు అతనికంటె అనుభవశాలి నమకుంటున్న వాచ్‌మన్ రామయ్య.

— కెప్టెన్ షేక్ మౌలాలీ